క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు


కట్టమూరులో అపరాల పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దాపురం: సాగులో సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మార్టేరు ఏడీఆర్ భరత్‌లక్ష్మి అన్నారు. కట్టమూరు, గోరింట గ్రామాల్లో శుక్రవారం ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ సీహెచ్ వెంకట నరసింహారావు, శాస్త్రవేత్తల బృందంతో కలసి వరి, అపరాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా భరత్‌లక్ష్మి మాట్లాడుతూ అపరాల్లో 884 రకం పల్లాకు తెగులును తట్టుకుని స్థిరమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. వరిలో చీడపీడల నివారణకు సంబంధించి రైతులకు సమగ్రమైన సమాచారం అందిస్తున్నామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో పంటలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ పి.మునిరత్నం, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నా


ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

పిఠాపురం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గొల్లప్రోలు మండలం యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సీ భవనం వద్ద ఉపాధ్యాయులు శుక్రవారం ధర్నాకు దిగారు. గొల్లప్రోలు మండలంలో ఉపాధ్యాయులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించడంలో ఎంఈఓ అనుచిత వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపిస్తు వారు ధర్నా చేశారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీఓ శర్మ వారికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి.ఈశ్వరరావు, ఎంవీ సత్యనారాయణ, ఏ సీతారామరాజు, సీహెచ్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి వరకూ పంట నమోదు సవరణలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమార్

పిఠాపురం: పంట నమోదు చేసుకున్న రైతులకు ఆదివారం వరకు వివరాలను సవరించుకునే అవకాశం కల్పించినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.విజయకుమార్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల సామాజిక తనిఖీల్లో బాగంగా మండలం మాధవపురం ఆర్బీకేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి పంట నమోదు చేసుకున్న రైతులకు వారి పేర్లు, ఖాతా నంబరు, సర్వే నంబరు, పంట రకం, పంట విత్తిన తేదీ తదితర వివరాలను చదివి వినిపించి మార్పులు చేర్పులు ఉన్నాయో లేదో తెలుసుకున్నారు. అభ్యంతరాలు ఉంటే రైతు బరోసా పోర్టల్‌లో సంబంధిత వీఏఏల ద్వారా అప్‌లోడ్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి అచ్యుతరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గట్టి మోహనరావు, వీఏఏలు కుమారి, ఆశాలత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లకు రూ.49.56 కోట్ల జమ

కాకినాడ సిటీ: జిల్లాలోని రైస్ మిల్లర్లకు గత సీజన్‌లకు సంబంధించి రూ.49.56 కోట్లు జమ చేయనున్నట్లు జేసీ ఎస్.ఇలక్కియ తెలిపారు. శుక్రవారం సాయంత్రం జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు అన్నీ పూర్తిస్థాయిలో సీఎంఆర్‌లో పాల్గొనేందుకు సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మెషినరీ, హమాలీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఎంఆర్‌లో పాల్గొనే రైస్ మిల్లర్లు అందరూ వారి మిల్లుల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని వాటిని కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేసేలా తగు చర్యలు తీసుకోవాలని జేసీ అన్నారు. ధాన్యం సేకరణకు అవసరమయ్యే గోనె సంచులను నిర్దేశించిన గోదాముల్లో ముందుగానే జమ చేయాలని, నిర్దేశించిన బ్యాంకు గ్యారంటీలను నిర్ణీత గడువుతో అందజేయాలని, అగ్రిమెంట్లు ఇవ్వాలన్నారు. మిల్లులకు మాత్రమే సీఎంఆర్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని ఆమె తెలిపారు. రబీ 2022–23 సీజన్‌కి సంబంధించి సీఎంఆర్ రైస్ ఈ నెలాఖరులోగా పంపిణీ చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సీసీ కెమెరాలు, గోనె సంచులు, బ్యాంకు గ్యారంటీలను ప్రభుత్వ ఆదేశాల ఏర్పాటు చేయాలని మిల్లర్లను కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ డి.పుష్పమణి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికే సురక్ష

- శిబిరంలో 364 మందికి పరీక్షలు
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు


రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు, అధికారులు

కొత్తపల్లి: పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని యండపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల వద్ద రెండో సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. మీకు ఇంకా ఏమైనా అవసరమైన సేవలు ఉన్నాయా, ప్రభుత్వం నుంచి ఎటువంటి వైద్య సేవలు కోరుకుంటున్నారు అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో 364 మందికి నాగులాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో క్లినిక్‌లు ఏర్పాటు చేశామని, ప్రజా ఆరోగ్యం పేద ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించినట్టు ఆయన చెప్పారు. గతంలో ఏదైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రజలందరికీ తమ ఇంటి వద్ద ఆరోగ్య సేవలు అందించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, సర్పంచ్ శీలం పెద అప్పారావు, ఉప సర్పంచ్ గుండ్రా చిన్నారావు, గుండ్ర రాజుబాబు, గ్రామ సచివాలయ కన్వీనర్ గుండ్ర జగ్గారావు, ఎంపీటీసీ బర్రే రవి, కో ఆప్షన్ సభ్యులు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీడీఓ పి.వెంకట నారాయణ తదితరులు ఉన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం


గొంచాలలో మందుల కిట్ అందజేస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ, వైద్యులు

సామర్లకోట: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ప్రశాంత్ అన్నారు. గొంచాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం అందుతుందన్నారు. వైస్ ఎంపీపీ–1 పేర్నిడి వెంకట్రాయుడు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. డాక్టర్లు ప్రశాంత్, శ్రీహిమవతి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సేవలందించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చోడిశెట్టి చిన్నజోగారావు, అముజాల దొరబాబు, ఉప సర్పంచ్ ముమ్మిడి శివశంకర వరప్రసాద్, గృహ సారథుల గ్రామ కన్వీనర్ పేర్నిడి సూర్యారావు, పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తితత్వాన్ని పెంచుకోవాలి

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ భగవంతుని పట్ల భక్తి తత్వాన్ని పెంచుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొండెవరంలో కొలువైన కనకదుర్గ ఆలయం వద్ద శరన్నవరాత్రుల ముగింపులో భాగంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారిని, స్వామి వారిని ఆయన దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సుమారు ఐదు వేల మంది భక్తులకు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాస్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో కోడిగుడ్ల పరిశీలన

సామర్లకోట: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న పథకానికి ఏజెన్సీ ద్వారా సరఫరా చేసిన కోడిగుడ్లను మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ శుక్రవారం పరిశీలించారు. ఈ గుడ్లు నాసిరకంగా ఉంటున్నాయని పాఠశాల హెచ్‌ఎం మీనామాధురి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై ఎంఈఓ వై.శివరామకృష్ణయ్యను వివరణ కోరగా కోడిగుడ్ల పైభాగంలోని పెంకులు పగిలి ఉన్నాయని, వాటిని నాసిరకం గుడ్లు అనడం చేయడం సరికాదని హెచ్‌ఎం చెప్పారన్నారు. దీనిపై సోమవారం పరిశీలిస్తామన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల ఇంట వెలుగు


పార్టీ నాయకులు, గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

- హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దొరబాబు
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు వచ్చాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక గాంధీచౌక్ రైతు భవనంలో శుక్రవారం మండల స్థాయి వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి సీఎం జగన్ చరిత్ర సృష్టించారని, దీనిని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. గత టీడీపీ హయాంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు తుంగలోకి తొక్కారన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు చెప్పాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. 20 ఏళ్ల తన రాజకీయ జీవితానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 12న సామర్లకోట వచ్చిన సందర్భంగా ఒక అర్థం చెప్పారని దొరబాబు వివరించారు. సామర్లకోటలో జరిగిన బహిరంగ సభను తన జీవితంలో మరచిపోలేనన్నారు. స్థానికుడైన తనకు పెద్దాపురం ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పిస్తూ సభలో ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపిస్తానన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై వీడియో ప్రదర్శన చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో దొరబాబును ఎమ్మెల్యేగా, జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, గృహసారథుల మండల కన్వీనర్ ఉటా వాసు, నాయకులు ఎలిశెట్టి నరేష్, తలారి దొరబాబు, గోలి బాపిరాజు, సొసైటీ అధ్యక్షులు వీరంరెడ్డి నాని, మలకల వరహాలబాబు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మోరంపూడి రమేష్, వైస్ ఎంపీపీ ములసా శ్రీను, మండల పరిషత్తు కోఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- మూలపేటలో గడప గడపకూ..


మూలపేటలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: జగనన్న పాలనలో కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికీ మేలు జరిగిందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పేర్కొన్నారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యేకు సర్పంచ్ కంబాల మౌనిక, ఎంపీటీసీలు అద్దా పాప, గోగు లోవ కుమారి స్వాగతం పలికి ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. గ్రామాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పార్కు ప్రహరీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని, గత ప్రభుత్వంలో ప్రజలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. 2024లో కూడా జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా గెలిపించుకుందామని అన్నారు. దళితులకు పెద్దపీట వేసి వారి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి దళితులందరూ భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, స్థానిక నాయకులు కంబాల లక్ష్మణరావు, అద్దా త్రిమూర్తులు, గోగు జగన్నాథం, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ జ్యోతుల బాబులు, సర్పంచ్ పులి జయబాబు, నక్క మణికంఠబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో చెకుముకి సంబరాలు

- జేవీవీ కన్వీనర్ గంగరాజు


చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

పిఠాపురం: వచ్చే నెల పదో తేదీ నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక చెకుముకి కన్వీనర్ ఎస్.గంగరాజు తెలిపారు. శుక్రవారం ఎంఆర్‌సీ భవనంలో ఎంఈఓ నారాయణదాసు చేతుల మీదుగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్సు సంబరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలను 33 ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. నవంబర్ 10వ తేదీన పాఠశాల స్థాయిలోను, 30న మండల స్థాయిలోను, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలోను, 2024 జనవరి27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరుగుతాయన్నారు. 1 నుంచి పదో తరగతి చదువుకునే విద్యార్థులు అందరూ పాల్గొనవచ్చని, ప్రవేశ రుసుము రూ.10 మాత్రమే అని ఆయన తెలిపారు. జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.సూర్యనారాయణ రాజు, మున్సిపల్ గరల్స్ హైస్కూలు హెచ్‌ఎం మూర్తి, విరవ హైస్కూలు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు తెలుసుకునేందుకు సర్వే


సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు తెలుసుకునేందుకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) చేస్తున్నామని ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు. దీనిపై శుక్రవారం మండల స్థాయిలో హైస్కూళ్ల హెచ్‌ఎంలకు స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, విధి విధానాలను కచ్చితంగా పాటించాలన్నారు. జాతీయ స్థాయిలో నాస్‌కి అనుగుణంగా సీస్ పరీక్ష రాష్ట్ర విద్యా శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నవంబరు 3న పబ్లిక్ పరీక్షల మాదిరిగా నిర్వహిస్తామని చెప్పారు. గణితం, లాంగ్వేజ్‌లలో 60 మార్కులకు ఓఎంఆర్ విధానంలో పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు గుర్తించి, జాతీయ స్థాయిలో మన ర్యాంక్ తెలుసుకోవడంతో పాటు దానికి అనుగుణంగా ప్రమాణాల పెంపునకు ప్రణాళిక రూపొందిస్తారన్నారు. హెచ్‌ఎంల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కూర్మారావు, హెచ్‌ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, ఎల్.గోవిందరాజు, యు.సత్యనారాయణ, ప్రసూన, కుసుమ, మీనామాధురి, పాండవులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల మూసివేత

బోట్‌క్లబ్: చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం కాకినాడలోని పలు ఆలయాలు మూసివేయనున్నారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆలయాలు మూతపడనున్నాయి. సంప్రోక్షణ అనంతరం ఆలయాలు తెరవనున్నట్లు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఇప్పటికే ఆలయాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం వల్ల మూసివేయనున్నట్లు ఈవో తెలిపారు.

31న కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈ నెల 31న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని అన్నారు. పట్టణంలోని అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు.

నేడు పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ ఛైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు


ఆర్‌బీపట్నంలో పూజలు చేస్తున్న వీర్రాజు దంపతులు


పెద్దాపురంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ వారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం చేశారు. అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఆర్‌బీ పట్నంలో డీసీసీబీ ఛైర్మన్..

ఆర్‌బీ పట్నం వినాయక ఆలయంలో డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్‌బీ పట్నం సొసైటీ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రసిద్ధి చెందిన పురాతన వినాయక ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. సర్పంచ్ చీకట్ల లక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, పుట్టా వెంకట్రావు, గుణ్ణం వీరభద్రరావు, మార్ని వెంకన్న, బొడ్డు శ్రీను, కుట్టయ్యచౌదరి తదితరులున్నారు.

వాకతిప్పలో భారీ అన్న సమారాధన

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పలో కొలువైన బాలదుర్గ ఆలయం వద్ద శరన్నవరాత్రుల ముగింపులో భాగంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెళ్లి విందును తలపించేలా పలు రకాల పిండి వంటలతో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వాకతిప్ప గ్రామం నుంచే కాకుండా కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, ఉప్పాడ తదితర గ్రామాల నుంచి సుమారు 3 వేల మంది భక్తులు బాలదుర్గ అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అయ్యప్ప మాలధారులు కూడా పాల్గొన్నారు.

ఎండు తెగులుతో కలవరం

- వరిలో ఆశిస్తున్న వైనం
- వాతావరణ మార్పులే కారణం


ఎండు తెగులు ఆశించిన వరి పొలం

పెద్దాపురం: వరి పంటను ఆకు ఎండు తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దాపురం మండలంలో సుమారు 23 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోంది. ఇందులో సాంబా మసూరి సుమారు మూడు వేల ఎకరాల్లో వేశారు. ఈ రకానికి ఎండు తెగులు వేగంగా సోకుతుంది. ఈ ఏడాది వాతావరణ మార్పులూ ఈ తెగులు సోకడానికి ప్రధాన కారణం. ఈ బ్యాక్టీరియా వేగంగా వ్యాపిస్తుంది. ఉదయం సమయంలో వరి ఆకులపై జిగురు ఏర్పడి, నీటి ద్వారా ఇతర పొలాలకు వ్యాపిస్తుంది. వరి ఆకు పసుపు రంగుగా మారి ఎండిపోతోంది. వాతావరణం చల్లగా ఉన్నందున ఎండు తెగులు వేగంగా వ్యాప్తి చెందుతోంది. దీంతో పంట దిగుబడి బాగా తగ్గుతుంది. దీని నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పొలంలోని మురుగు నీరు ఎప్పటికప్పుడు తీసివేయాలి. పొలం గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. ఈ చర్యలు చేపడితే ఎండు తెగులు వ్యాప్తిని తగ్గించవచ్చు.

యాజమాన్య పద్ధతులే మేలు



ఎండు తెగులుకు మందు లేదు. తెగులు ఆశించిన పొలంలో పూర్తిగా యూరియా ఎరువు తాత్కాలికంగా నిలిపివేయాలి. పోటాష్ ఎకరానికి 20 కిలోలు వేయాలి. పొలంలో మురుగునీరు తీసివేయాలి. తెగులు ఉధృతిని తగ్గించడానికి ఎకరానికి ప్లాంటోమైషన్ 20 గ్రాములు, కాపర్ ఆక్సిక్లోరైడ్ 400 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

– కె.సంజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, పెద్దాపురం

మందులు వాడినా..



నాలుగు ఎకరాల్లో వరి పంట వేశాను. ఎండు తెగులు ఎక్కువగా ఉంది. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేదు. వాతావరణ మార్పులతోనే ఇది ఆశించింది. పంట వేసినప్పటి నుంచి వర్షం, ఎండలు, మంచు బెడదతో పంట దెబ్బతింటుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలి.

– సుందరెడ్డి రాజు, కౌలురైతు, పులిమేరు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


సామర్లకోటలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విద్యార్థులకు స్టేషన్‌లోని విధులపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సామర్లకోట: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ప్రగతి విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని పోలీసులు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసు మృతవీరులకు సంతాపం తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని ట్రాఫిక్ ఎస్సై గరగారావు పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్స్ ఎం.సురేష్, జి.నాగబాబు, జి.నరేష్, ఏఓ సత్యనారాయణ, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. మండల స్థాయి విజేతలను కాకినాడ జిల్లా స్థాయికి పంపించనున్నారు.

పోలీసు స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

కొత్తపల్లి: పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో పోలీసులు ముచ్చటించారు. చెడు ప్రవర్తనలు అలవాటు చేసుకోవద్దని, మంచి నడవడికతో మెలగాలని ఎస్సై స్వామినాయుడు సూచించారు. పెద్ద గోల్స్ సాధించాలంటే ముందుగా చిన్న చిన్న గోల్స్ పెట్టుకొని వాటిని సాధించుకుటూ ముందుకు సాగాలన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణతో పోలీసుల పాత్ర ప్రధానమైందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు.